క్లుప్తంగా

ఆధ్యాత్మికతకు యాత్రలు దోహదం

రాజానగరం: సామూహికంగా తీర్థయాత్రలు చేయడం వలన ప్రజల్లో ఆధ్యాత్మిక భావాలు మరింత పెంపొందే అవకాశం ఉంటుందని, యాత్ర కూడా ఆనందకరంగా, ఉత్సాహంగా సాగుతుందని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. వెలుగుబంద గ్రామానికి చెందిన 70 మంది భక్తులు మోటార్ సైకిళ్లపై తిరుమల శ్రీ వేంకటేశ్వరుని దర్శనానికి మంగళవారం పయనమయ్యారు. దివాన్ చెరువు పండ్ల మార్కెట్ వద్దకు చేరుకున్న వారికి ఎమ్మెల్యే రాజా స్వాగతం పలికారు. పండ్లు పంచి, జెండా ఊపి యాత్రను ప్రారంభించారు. దిగ్విజయంగా యాత్ర పూర్తి చేసుకుని క్షేమంగా తిరిగి రావాలని ఆకాంక్షించారు.

రామలింగేశ్వరస్వామికి వెండి పానవట్టం సమర్పణ



అర్చకులకు వెండి పానవట్టం అందజేస్తున్న కిరణ్ దంపతులు

గోకవరం: స్థానిక పర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరస్వామి వారి ఆలయానికి భక్తులు వెండి పానవట్టం సమర్పించారు. రాజమహేంద్రవరానికి చెందిన వ్యాపారి సేనాపతి కిరణ్ రూ.2.40 లక్షల వ్యయంతో రెండున్నర కిలోల వెండితో స్వామివారికి ఈ పానవట్టం చేయించారు. దీనిని అర్చకులకు మంగళవారం అందజేశారు. దీనికి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారికి అలంకరించారు. కార్యక్రమంలో స్వామివారి సేవకులు తుమ్మల రామకృష్ణ, ఏనుగు రాము, ఇనకోటి పెద్దలు, సంగుల మణికంఠ, పలెల్ల త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

18న వినాయక చవితి ఆచరించాలి

పెదపూడి: ఈ నెల 18, 19 తేదీల్లో ఏ రోజు వినాయక చవితి ఉత్సవం చేసుకోవాలన్న సందిగ్ధంలో ఉన్న భక్తులు ఈ నెల 18న ఉదయం నుంచి తదియతో కూడిన చవితి ఆచరించడం మంచిదని ప్రముఖ పండితులు మిక్కిలి దుర్గయ్యశాస్త్రి మంగళవారం తెలిపారు.

రేషన్ షాపులపై విజిలెన్స్ అధికారుల దాడి

రంగంపేట: మండలంలోని వడిశలేరులో ఉన్న రేషన్ షాపులపై విజిలెన్స్ అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 10వ నంబర్ రేషన్ షాపులో అవకతవకలు జరిగినట్టు అధికారులు గుర్తించారు. బియ్యం 719 కిలోలు, పంచదార 4.5 కిలోలు, శనగలు కిలో, బెల్లం 4 కిలోలు, రాగిపిండి 4 కిలోలు ఉండాల్సిన పరిమాణం కంటే తక్కువగా ఉన్నట్టు, కందిపప్పు 24 కిలోలు ఎక్కువ ఉన్నట్టు గుర్తించారు. షాపు యజమానిపై 6ఏ కేసు నమోదు చేశారు. ఈ దాడుల్లో విజిలెన్స్ తహసీల్దార్ కె.విజయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

కాలువలో పూడిక తొలగింపు

పెదపూడి: మండలంలోని జి.మామిడాడ నుంచి గంధ్రేడు వెళ్లే పంట కాలువలో పూడిక తొలగింపు పనులు చేపట్టామని స్థానిక లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కడిమి శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. కొంతమంది కూలీలతో చెత్త తొలగించడంతో పాటు పిచ్చి మొక్కలు చనిపోయే మందును పిచికారీ చేయిస్తున్నామన్నారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు ఆర్ఏఆర్‌కే చౌదరి, సబ్బెళ్ల మోహన్‌రెడ్డి, ఛత్రపతి శివాజీ, రాయుడు రాఘవ తదితరులు పాల్గొన్నారు.

చాప్ కట్టర్లతో ఎంతో మేలు

రంగంపేట: చాప్ కట్టర్ల(గడ్డిని ముక్కలుగా కత్తిరించే యంత్రాలు)తో పాడి రైతులకు ఎంతో ఉపయోగమని మండల పశువైద్యాధికారి ఈ.జాన్‌పాల్ అన్నారు. మంగళవారం వడిశలేరులో సబ్సిడీపై మంజూరైన చాప్ కట్టర్స్‌ను పాడి రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాప్ కట్టర్ విలువ రూ.33,970 కాగా ప్రభుత్వం రూ.13,588 సబ్సిడీ ఇస్తుందన్నారు. మండలానికి మొత్తం 6 చాప్ కట్టర్స్ మంజూరు కాగా వడిశలేరులో నలుగురు, రంగంపేటలో ఇద్దరు పాడి రైతులకు అందించామన్నారు.

ఉపాధ్యాయులను తీసుకెళ్లమనడం దారుణం

పెదపూడి: మరుగుదొడ్లు శుభ్రం చేసే సామాన్లు ఉపాధ్యాయులను తీసుకెళ్లమనడం దారుణమని రాష్ట్రోపాధ్యాయ సంఘం(ఎస్‌టీయూ) కాకినాడ జిల్లా ఆర్థిక కార్యదర్శి ఎస్.సత్యనారాయణ మంగళవారం ఓ ప్రకటనలో ఆరోపించారు. మండల విద్యాశాఖ కార్యాలయం నుంచి మండలంలోని అన్ని పాఠశాలలకు మరుగుదొడ్లు శుభ్రం చేసే సామాన్లు పంపిణీ చేయాల్సి ఉందన్నారు. అయితే వాటిని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వచ్చి తీసుకెళ్లాలని విద్యాశాఖ కార్యాలయ అధికారులు చెప్పడంపై పలువురు ఉపాధ్యాయులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారన్నారు.

రికార్డుల పరిశీలన

సీతానగరం: వార్షిక తనిఖీల్లో భాగంగా స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రికార్డులను జిల్లా రిజిస్ట్రార్ కె.ఆనందరావు మంగళవారం పరిశీలించారు. సబ్ రిజిస్ట్రార్ ఆర్.శ్రీనివాస్ సమక్షంలో రికార్డులు పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు.

సుభద్రంపేట పెద్ద చెరువుకు మహర్దశ

- రూ.30 లక్షలతో పూర్తి అభివృద్ధి
- 300 ఎకరాల ఆయకట్టుకు ఉపయోగం



సుభద్రంపేటలోని 300 ఎకరాల ఆయకట్టు గల పెద్ద చెరువు



చెరువు గట్టును కలుపుతూ నిర్మించిన సిమెంట్ రోడ్డు

రంగంపేట: మెట్టప్రాంతమైన రంగంపేట మండలంలో వర్షాధారంతోనే ఎక్కువగా పంటలు సాగవుతాయి. వర్షాలు ప్రారంభం కాగానే రైతులంతా నారు మడులు వేసుకుని నాట్లు పూర్తిచేస్తారు. ఆ తరువాత స్థానిక చెరువుల నీటిని ఉపయోగించి పంటలను కాపాడుకుంటారు. మండలంలోని సుభద్రంపేటలో పెద్ద చెరువు కింద 300 ఎకరాల ఆయకట్టు ఉంది. అయితే ఈ చెరువు గత ప్రభుత్వాల హయాంలో అభివృద్ధికి నోచుకోలేదు. ప్రధానంగా స్లూయిజ్‌లు దెబ్బతినడంతో పాటు సాగునీరు వెళ్లే కాలువలు పాడైపోవడంతో సాగు అవసరాలకు నీరు లేక ఆయకట్టు రైతులు తీవ్ర ఇబ్బందులు పడేవారు.

ఎమ్మెల్యే చొరవతో చెరువు అభివృద్ధి

జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు స్థానిక రైతుల ఇక్కట్లను తెలియజేస్తూ చెరువు అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డిని కోరారు. దీంతో ఆయన రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, జిల్లా కలెక్టర్ కె.మాధవీలతల సహకారంతో రూ.30 లక్షలు డీఎంఎఫ్ నిధులు మంజూరు చేయించి చెరువును అభివృద్ధి చేశారు. ఈ నిధులతో సాగునీరు కోసం రెండు స్లూయిజ్‌లు నిర్మించడంతో పాటు కాలువలను ఆధునీకరించారు. పశువుల నీటి సౌకర్యం కోసం చెరువు వద్ద ర్యాంపు వేశారు. అంతేకాకుండా చెరువు గట్టు నుంచి ప్రధాన రహదారి వరకూ సిమెంట్ రోడ్డు నిర్మించారు. ఈ పనులన్నీ పూర్తి కావడంతో అటు ఆయకట్టు రైతులు, ఇటు పాడి రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ఆయకట్టు రైతుల హర్షం

గత ప్రభుత్వ హయాంలో సుభద్రంపేటలోని పెద్ద చెరువు అభివృద్ధికి నోచుకోలేదు. ఆయకట్టు రైతులు, పాడి రైతుల ఇబ్బందులను వివరించగానే ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి నిధులు మంజూరు చేయించి చెరువును అభివృద్ధి చేశారు. దీంతో ఆయకట్టు రైతులంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు. చెరువును అభివృద్ధి చేసిన ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డికి కృతజ్ఞతలు.

– పేపకాయల రాంబాబు, జెడ్పీటీసీ సభ్యుడు, రంగంపేట

ప్రగతి పథంలో రాష్ట్రం

- ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా
- కోటికేశవరంలో గడప గడపకూ మన ప్రభుత్వం



గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

మధురపూడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో రాష్ట్రం ప్రగతి పథంలో పయనిస్తోందని రాజానగరం ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. కోరుకొండ మండలం కోటికేశవరం గ్రామంలో మంగళవారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని కొత్త కాలనీలో ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాలందుతున్న తీరు అడిగి తెలుసుకున్నారు. కాలనీలో డ్రైనేజీలు, కల్వర్టులు, శ్లాబులు నిర్మించాలని ఈ సందర్భంగా స్థానికులు కోరారు. విద్యుత్ స్తంభాలు అడ్డంగా ఉన్నాయని చెప్పారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా వీటిని మార్చాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే రాజా ఆదేశించారు. కోటికేశవరాన్ని సమస్యలు లేని గ్రామంగా తీర్చిదిద్దుతానని, ఇప్పటికే వివిధ పనులకు రూ.6.38 కోట్లు కేటాయించామని తెలిపారు. మంచినీటి ఎద్దడి నివారణకు ఇప్పటికే రూ.64 లక్షలతో ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మించామన్నారు. సంక్షేమ పథకాల అమలుతో పాటు, సమస్యల పరిష్కారానికి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ఉపయోగపడుతోందని చెప్పారు. సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకూ మొత్తం 300 ఇళ్లను ఆయన సందర్శించారు. ఇటీవల మధురపూడి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన దోసకాయలపల్లికి చెందిన ఉండ్రశ్రీ సుధాకర్ దంపతులను జక్కంపూడి రాజా పరామర్శించారు. బాధితులకు మెరుగైన వైద్యం అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమాల్లో సర్పంచ్ ముడే సింధే దివ్య, జెడ్పీటీసీ సభ్యుడు కర్రి నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు ములగాడ ఫణి, మండల కన్వీనర్ గణేశుల పోసి, సర్పంచుల సమాఖ్య మండలాధ్యక్షుడు కడియాల పాపారావు, ఎంపీటీసీ సభ్యులు నేతల బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

లాలాచెరువు హెచ్‌బీ కాలనీ అభివృద్ధికి కృషి



అంబేడ్కర్ ఎరీనా పార్కుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా. చిత్రంలో కమిషనర్ దినేష్‌కుమార్ తదితరులు

రాజానగరం: లాలాచెరువు హౌసింగ్ బోర్డ్ కాలనీలో గడచిన మూడున్నర దశాబ్దాల్లో జరగని అభివృద్ధిని నాలుగున్నరేళ్లలో చేసి చూపించామని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. నగర పాలక సంస్థ పరిధిలో ఉన్న ఈ కాలనీలో రూ.1.20 కోట్లతో ఏర్పాటు చేయనున్న అంబేడ్కర్ ఎరీనా పార్కుకు కమిషనర్ కె.దినేష్ కుమార్‌తో కలసి మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. జాతీయ రహదారిని అనుకుని ఉన్న ఈ ప్రాంతంలో రూ.2 కోట్లతో ఆర్ఆర్ఆర్ పార్కు నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని రాజా చెప్పారు. అలాగే స్పిన్నింగ్ మిల్లు కాలనీలో మరో రూ.3 కోట్లతో చిల్డ్రన్స్ పార్కు, కాలనీ వెలుపల ఖాళీ స్థలంలో రూ.కోటితో బటర్‌ఫ్లై థీమ్ పార్కు అభివృద్ధికి కార్యాచరణ రూపొందించామని వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ నివాస స్థలాలు అందించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. కమిషనర్ దినేష్ కుమార్ మాట్లాడుతూ, కాలనీలో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. రోడ్లు, డ్రైన్లు, పార్కులు, క్రీడా సదుపాయాలు కల్పించేందుకు బాధ్యత తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మండారపు సీతారత్నం, జెడ్పీటీసీ సభ్యుడు వాసంశెట్టి పెదవెంకన్న, మార్కెట్ కమిటీ చైర్మన్ నక్కా రాంబాబు, నెడ్‌క్యాప్ డైరెక్టర్ గండి నానిబాబు, వైఎస్సార్ సీపీ మండల మాజీ కన్వీనర్ మండారపు వీర్రాజు, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ ఆవాల సతీష్ పాల్గొన్నారు.

మహిళలే మహారాణులు



సమావేశంలో మాట్లాడుతున్న జక్కంపూడి విజయలక్ష్మి

రాజానగరం: రాష్ట్రంలో ప్రతి మహిళా స్వశక్తితో మహారాణిలా ఎదగాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలన్నింటినీ వారికే అందజేస్తున్నారని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి అన్నారు. నరేంద్రపురం, నందరాడ గ్రామాల్లో స్వయం సహాయక సంఘాల సభ్యులతో మంగళవారం ఆమె సమావేశమయ్యారు. గతంలో ఏ ప్రభుత్వమూ చేయని రీతిలో సుమారు 31 లక్షల నివాస స్థలాలను మహిళల పేరిటే సీఎం జగన్ పంపిణీ చేశారని ఈ సందర్భంగా అన్నారు. అలాగే 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తూ నియోజకవర్గాన్ని అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ముందంజలో నిలిపారన్నారు. రాష్ట్ర ప్రగతికి, మహిళల అభ్యున్నతికి శ్రమిస్తున్న ఈ ఇద్దరు నేతలను రానున్న ఎన్నికల్లో కూడా గెలిపించి, మరోసారి వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావాలని విజయలక్ష్మి కోరారు.

శానిటరీ మెటీరియల్ రాక

మధురపూడి: ప్రభుత్వ పాఠశాలలకుఅవసరమైన శానిటరీ మెటీరియల్ మంగళవారం కోరుకొండ మండలం కాపవరంలోని ఎంఈఓ కార్యాలయానికి చేరింది. ఆ సామగ్రిని ఎంఈఓ టి.కుశలవదొర పరిశీలించారు. మండలంలోని 55 పాఠశాలల్లో శానిటేషన్ నిమిత్తం ఈ పరికరాలను అందజేయనున్నారు.

సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్ పాలన

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- రెండు కమ్యూనిటీ భవనాల ప్రారంభం



రెల్లి కమ్యూనిటీ హాలును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుస్థిరమైన, సుపరిపాలన అందిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. స్థానిక రెల్లి వీధి, వెంకటరత్నాపురం ప్రాంతాల్లో గ్రాసిం ఇండస్ట్రీస్ సౌజన్యంతో నిర్మించిన రెండు సామాజిక భవనాలను ఎమ్మెల్యే మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి కృషి చేస్తున్న ప్రభుత్వం వారి అభ్యున్నతికి అనేక పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తోందన్నారు. మూడు దశాబ్దాలుగా రెల్లి కులస్తులు సామాజిక భవనం కోసం ఎదురుచూస్తున్నారని, తన హయాంలో కమ్యూనిటీ భవనం నిర్మాణం జరిగి ప్రారంభించటం సంతోషాన్నిస్తోందన్నారు. అన్ని సౌకర్యాలతో సామాజిక భవనాలను నిర్మించిన గ్రాసిం సంస్థకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలియజేశారు. గ్రామీణ ప్రాంతాల్లో వసతులను మెరుగుపరిచేందుకు గ్రాసిం ఇండస్ట్రీస్ సంస్థ తమ వంతు సాయాన్ని అందిస్తుందని కొనియాడారు. అనంతరం కమ్యూనిటీ భవన నిర్మాణాలకు కృషిచేసిన ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ వారా కుమారి, గ్రాసిం సంస్థ హెచ్‌ఆర్ మురళీకృష్ణ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర రెడ్డి, భట్రాజుల కార్పొరేషన్ డైరెక్టర్లు సత్తి రామకృష్ణారెడ్డి, షణ్ముఖి చిట్టిరాజు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి చిర్ల వీర్రాఘవరెడ్డి, పార్టీ గ్రామ కమిటీ కన్వీనర్ నల్లమిల్లి మురళీమోహనబాలకృష్ణారెడ్డి, ఏజీపీ వెలగల లక్ష్మీనారాయణ రెడ్డి, ఎంపీటీసీలు తుమ్మా రాజేశ్వరి, కొండేటి భీమేష్, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు న్యాయం చేయడమే లక్ష్యం

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- రంగాపురంలో గడప గడపకూ మన ప్రభుత్వం



రంగాపురంలో లబ్ధిదారుకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

బిక్కవోలు: పేదవాడికి న్యాయం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. మంగవారం రంగాపురం గ్రామంలో ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి గత నాలుగేళ్లుగా ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని వివరించి వారికి బుక్‌లెట్లను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలో ఆదర్శ పాలన కొనసాగుతుందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల నిరుపేద కుటుంబాల్లో వెలుగులు నిండుతున్నాయన్నారు. సంక్షేమ పథకాలన్నీ మళ్లీ అందాలంటే సీఎంగా జగన్ మోహన్‌రెడ్డిని మళ్లీ గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గండికోట వీరభద్రరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతుల ప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ప్రచార కమిటీ అధ్యక్షుడు రొంగల అప్పాజీ, ఉప సర్పంచ్ శాంతికుమారి, సచివాలయ కన్వీనర్ నక్క వీర వెంకటరమణ, ఇజ్జన లలిత కుమారి, ముప్పిడి కృష్ణ పాల్గొన్నారు.

పాఠశాలల్లో క్రీడా సందడి

మధురపూడి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన కోరుకొండ మండల స్థాయి క్రీడా పోటీలు, ఎంపికలు మంగళవారం కోలాహలంగా జరిగాయి. గుమ్ములూరు హైస్కూల్‌లో అండర్-14, 17 విభాగాల్లో ఈ పోటీలు నిర్వహించారు. వీటిని గుమ్ములూరు సర్పంచ్, ఏఎంసీ చైర్మన్ నక్కా రాంబాబు ప్రారంభించారు. విద్యార్థులు, చదువుతో పాటు, క్రీడల్లోనూ రాణించాలని ఈ సందర్భంగా ఆయనన్నారు. కొద్దిసేపు వాలీబాల్, కబడ్డీ ఆడి, విద్యార్థులను ఉత్సాహపరిచారు. బాలుర విభాగంలో ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, త్రోబాల్, టెన్నిస్, షటిల్ పోటీలు నిర్వహించారు. మండలంలోని 20 ప్రభుత్వ, ప్రైవేటు హైస్కూళ్ల నుంచి మొత్తం 500 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఇక్కడ ప్రతిభ చూపిన వారిని నియోజకవర్గ స్థాయికి ఎంపిక చేస్తారు. అండర్-17 ఖోఖో పోటీల్లో కణుపూరు జట్టు విజేతగా, గుమ్ములూరు రన్నర్‌గా.. కబడ్డీలో కణుపూరు జట్టు విన్నర్‌గా, గాదరాడ జట్టు రన్నర్‌గా.. అండర్-14 కబడ్డీలో కణుపూరు జట్టు విజేతగా, శ్రీరంగపట్నం టీమ్ రన్నర్‌గా నిలిచాయి. కార్యక్రమంలో ఎంఈఓలు టి.కుశలవదొర, ఎం.సుజాత, ఉపసర్పంచ్ వంకా సోమరాజు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక వికాసం

అనపర్తి: క్రీడలు మానసిక వికాసానికి, శారీరక ఆరోగ్యానికి ఎంతో దోహదపడతాయని ఎంఈఓ-2 నల్లమిల్లి సత్తిరెడ్డి అన్నారు. స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-14, 17 బాలబాలికల మండల స్థాయి క్రీడా పోటీలు, సెలక్షన్స్ మంగళవారం ప్రారంభమయ్యాయి. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, త్రోబాల్, టెన్నికాయిట్, బాల్ బ్యాడ్మింటన్, షటిల్ బ్యాడ్మింటన్, యోగా, అథ్లెటిక్స్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన మొత్తం 300 మంది క్రీడాకారులు పాల్గొన్నట్లు నియోజకవర్గ స్పోర్ట్స్ కోఆర్డినేటర్ పి.శ్రీనివాసరెడ్డి తెలిపారు. పోటీలను పాఠశాల హెచ్‌ఎం పులగం వెంకటరెడ్డి, మండల స్పోర్ట్స్ కోఆర్డినేటర్ టీవీవీఎస్ రాఘవరెడ్డి, ఉపాధ్యాయులు పర్యవేక్షించారు.

రంగంపేటలో..

రంగంపేట: రంగంపేట జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి పాఠశాల క్రీడా పోటీలను జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు మంగళవారం ప్రారంభించారు. త్రోబాల్, వాలీబాల్, కబడ్డీ, కోకో పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు లంక చందన్న, ఎంఈవో-2 మధుసూదనరావు, హెచ్‌ఎం పార్థసారథి పాల్గొన్నారు.

త్వరలో ఇళ్ల పట్టాల పంపిణీ


మధురపూడి: కోరుకొండ మండలం కాపవరం, పశ్చిమ గానుగూడెం గ్రామాల్లో 1,200 మంది ఇళ్ల లేని నిరుపేదలకు త్వరలో ఇళ్ల స్థలాల పట్టాలు అందజేస్తామని రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా తెలిపారు. కాపవరంలోని 31 ఎకరాల స్థలాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలందుతాయని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ పాపారావు, హౌసింగ్ డీఈ బాబు, ఏఈ వెంకటరావు, మండల సర్వేయర్ దిలీప్, వీఆర్‌ఓ అర్జున్ పాల్గొన్నారు.

రైతుభరోసాకు దరఖాస్తుల స్వీకరణ

గోకవరం: మండలంలోని కొత్తగా పొలాలు కొనుక్కున్న పట్టాదారు పాస్ బుక్‌లు కలిగిన రైతులు వైఎస్సార్ రైతు భరోసాకి దరఖాస్తులు చేసుకోవచ్చునని ఏఓ రాజరాజేశ్వరీ మంగళవారం తెలిపారు. రైతులు తమ పాస్‌బుక్‌తో పాటు పూర్తి వివరాలు స్థానిక వీఏఏకు అందజేయాలని ఆమె తెలిపారు.

గంటల తరబడి స్తంభించిన ట్రాఫిక్

- ఇటు రోడ్డు విస్తరణ పనులు
- అటు గోతులు.. పట్టించుకోని అధికారులు
- ఏడీబీ రోడ్డుపై భారీగా నిలిచిపోయిన వాహనాలు



ఏడీబీ రోడ్డుపై నిలిచిపోయిన వాహనాలు



వెంకన్నపేట వద్ద గోతులను తాత్కాలికంగా పూడుస్తున్న దృశ్యం

రాజానగరం: ఓవైపు రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయి. ఈ క్రమంలో రోడ్డుపై భారీ గోతులు ఏర్పడ్డాయి. వర్షాలకు మరింత అధ్వానంగా మారాయి. దీనిపై వెంటనే స్పందించాల్సిన అధికారులు పట్టించుకోలేదు. ఫలితంగా మంగళవారం రాజానగరం – కాకినాడ ఏడీబీ రోడ్డుపై వెంకన్నపేట వద్ద వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. ఉదయం నుంచీ ట్రాఫిక్ అంతరాయం ఏర్పడగా. సాయంత్రానికి సమస్య మరింత తీవ్రమైంది. దీంతో అటు కాకినాడ, ఇటు రాజానగరం వైపు కిలోమీటర్ల కొద్దీ వాహనాలు గంటల తరబడి నిలిచిపోయాయి. ఏడీబీ రోడ్డు విస్తరణ పనులతో వెంకన్నపేట వద్ద రోడ్డు మధ్యన రెండు గోతులు పడ్డాయి. వాహనాల రాకపోకలతో అవి పెద్దవి కావడంతో వర్షపు నీరు చేరి చెరువుల్లా మారాయి. అవి గోతులని తెలియక ద్విచక్ర వాహనాలపై వెళ్తున్న కొంతమంది పడిపోయారు. అలాగే పామాయిల్ గెలల లోడుతో వెళ్తున్న లారీ ఓ గోతిలో దిగబడిపోయింది. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది మొదలైంది. అదే సమయంలో ఎదురుగా వచ్చిన మరో లారీ కూడా ఆ పక్కనే ఉన్న రెండో గోతిలో దిగబడిపోడటంతో ట్రాఫిక్ సమస్య తీవ్రరూపం దాల్చింది. ముందుకు, వెనుకకు వెళ్లే అవకాశం లేక వాహనాలు గంటల తరబడి నిలిచిపోయాయి. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకూ ఈ సమస్య అంతకంతకూ పెరుగుతూ వచ్చింది. విషయం ఆలస్యంగా తెలుసుకున్న రాజానగరం, రంగంపేట పోలీసులు అక్కడకు చేరుకుని, స్థానికుల సాయంతో ట్రాఫిక్‌ను చక్కదిద్దేందుకు ప్రయత్నించారు. స్థానికులు సమీపంలోని క్వారీ నుంచి కంకర తీసుకొచ్చి గోతులను తాత్కాలికంగా పూడ్చి వేశారు.

బిక్కవోలు ప్రెస్‌క్లబ్ భవనం ప్రారంభం



బిక్కవోలులో ప్రెస్‌క్లబ్ భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలులో గ్రాసిం ఇండస్ట్రీస్ సౌజన్యంతో నూతనంగా నిర్మించిన ప్రెస్ క్లబ్ భవనాన్ని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలో తమకు సరైన భవనం లేదని మీడియా ప్రతినిధులు తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. గ్రాసిం ఇండస్ట్రీస్‌తో మాట్లాడి భవనాన్ని నిర్మింపజేశామన్నారు. కార్యక్రమంలో జిల్లా మహిళ సంక్షేమ సంఘ చైర్‌పర్సన్ రొంగల పద్మావతి, కొమరిపాలెం ఉపసర్పంచ్ కొవ్వూరి సత్యనారాయణరెడ్డి, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ పోతుల ప్రసాద్‌రెడ్డి, సర్పంచ్ భద్రం, కొంకుదురు ఎంపీటీసీ కొంకుదురు పీవీ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఇలపల్లిలో గ్రాసిం ఇండస్ట్రీస్ నిర్మించిన కమ్యూనిటీ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు.

అతిథి అధ్యాపక పోస్టుకు 15 వరకూ గడువు

సీతానగరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హిస్టరీ సబ్జెక్టులో అతిథి అధ్యాపక పోస్టు భర్తీకి దరఖాస్తు గడువు ఈ నెల 15వ తేదీ వరకూ ఉందని ప్రిన్సిపాల్ డి.చిట్టిబాబు మంగళవారం విలేకర్లకు తెలిపారు. హిస్టరీలో 55 శాతం మార్కులతో పాటు, పీహెచ్‌డీ, నెట్, ఏపీ సెట్ వంటి అదనపు అర్హతలున్న వారికి ప్రాధాన్యం ఇస్తామని వివరించారు. ఆ రోజు సాయంత్రం 5 గంటల్లోగా దరఖాస్తులు స్వయంగా కళాశాలలో అందజేయాలన్నారు. అర్హులకు ఈ నెల 16వ తేదీ ఉదయం 10 గంటలకు కళాశాలలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని చిట్టిబాబు తెలిపారు.

బెస్ట్ సిటిజన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్



బెస్ట్ సిటిజన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అవార్డు అందుకుంటున్న తాడి చంద్రశేఖర్‌రెడ్డి

అనపర్తి: స్థానిక రామకృష్ణ సేవా సమితి కార్యదర్శిగా అందిస్తున్న సేవలకు గాను తాడి చంద్రశేఖర్ రెడ్డి స్టేట్ బెస్ట్ సిటిజన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అవార్డు అందుకున్నారు. హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ ఆడిటోరియంలో ఈ నెల 11న టీటీడీ పూర్వపు జేఏఓ, విశ్రాంత ఐఏఎస్ అధికారి బి.లక్ష్మీకాంతం చేతుల మీదుగా ఆయన ఈ అవార్డు తీసుకున్నారు. హైదరాబాద్‌కు చెందిన అర్పిత సాహిత్య, సాంస్కృతిక స్వచ్ఛంద సేవా సంస్థ ఆయనకి అవార్డు ఇచ్చింది. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రెడ్డిని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు నలమిల్లి శేషారెడ్డి, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, పడాల సుబ్బారెడ్డి, ఎం.దుర్గాప్రసాద్ తదితరులు అభినందించారు.

పుష్కర నుంచి 350 క్యూసెక్కుల విడుదల

సీతానగరం: పురుషోత్తపట్నంలోని తోట వెంకటాచలం పుష్కర ఎత్తిపోతల పథకం నుంచి 350 క్యూసెక్కుల నీటిని విడుదల చేశామని జలవనరుల శాఖ డీఈ వెంకట్రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పుష్కర-1, 2ల నుంచి చెరొక మోటార్ ద్వారా మెట్ట ప్రాంత పంట పొలాలకు సాగునీటిని విడుదల చేశామని వివరించారు. పుష్కర వద్ద గోదావరి నీటిమట్టం 19.2 మీటర్లు ఉందన్నారు. సాగునీటికి అంతగా డిమాండ్ లేకపోవడంతో ఉన్నతాధికారుల సూచనల మేరకు సాగునీటి విడుదలను తగ్గించామని తెలిపారు. డిమాండ్‌ను బట్టి నీటి విడుదలను పెంచుతామని వెంకట్రావు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి



దొడ్డిగుంటలో విద్యార్థులకు మొక్కలు అందజేస్తున్న పిరమిడ్ సొసైటీ ప్రతినిధులు

రంగంపేట: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని పిరమిడ్ సొసైటీ రాష్ట్ర ప్రచారకులు దాట్ల జగపతిరాజు అన్నారు. మంగళవారం మండలంలోని దొడ్డిగుంట, రామేశ్వరపేట, సుభద్రంపేట, వెంకటాపురం ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈవో పి.మధుసూదనరావు, నవీన్, అనిత, పిరమిడ్ సొసైటీ సభ్యులు మోహన్, వసంత్, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

రోగులకు రొట్టెల పంపిణీ

గోకవరం: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో కంబాల శ్రీనివాస్ సహకారంతో మంగళవారం గర్భిణులకు, బాలింతలకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ సామాజిక సేవలో భాగంగా ప్రతి వారం ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు కర్రి సూరారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు సుంకర వీరబాబు, వైద్యులు వనజ ఉన్నారు.